క్లుప్తంగా

నేటి నుంచి ఆర్‌పీఎల్ క్రికెట్ టోర్నమెంట్



క్రికెట్ టోర్నమెంట్‌కు కోర్టును సిద్ధం చేస్తున్న నిర్వాహకులు

రాయవరం: స్థానిక శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో ఈ నెల 13వ తేదీ శుక్రవారం నుంచి ఈ నెల 17వ తేదీ వరకు రాయవరం ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని టోర్నమెంట్ నిర్వాహకులు వుండవిల్లి రాంబాబు, రొంగల సాయిలు గురువారం విలేకరులకు తెలిపారు. బెల్లపు సూర్యప్రకాశరావు జ్ఞాపకార్థం ఈ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నామన్నారు. 10 ఓవర్ల పరిమిత క్రికెట్ టోర్నమెంట్‌లో రాయల్ వారియర్స్, డిసార్ట్ ఈగల్, డెడ్లీ స్ట్రైకర్స్, జాగ్వారా లెవన్, వైల్డ్ కింగ్స్ టీమ్‌లు పోటీ పడతాయని తెలిపారు. ఈ పోటీల్లో విన్నర్స్‌గా నిలిచిన టీమ్‌కు రూ.10 వేలు నగదు, రన్నర్స్ టీమ్‌కు రూ.5 వేలు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

రైతు సమస్యల పరిష్కారంలో ముందంజ



ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ మాత భారతి

కాజులూరు: రైతు సమస్యల పరిష్కారంలో ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుందని ఎంపీపీ మాత భారతి మురళి అన్నారు. కౌలురైతు సంఘం 2023 నూతన సంవత్సర క్యాలెండర్‌ను మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ మాత భారతి మురళి, ఎంపీడీఓ సీహెచ్ ఇందిరాదేవి, గ్రామ సర్పంచ్ దండంగి సరోజిని తదితరులు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు సమస్యలపై ఆంధ్రప్రదేశ్ కౌలురైతు సంఘం నిరంతర పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కౌలురైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

నానో యూరియాతో ప్రయోజనాలెన్నో



వెదురుపాక పొలంబడిలో రైతులకు సూచనలిస్తున్న ఏవో ప్రభాకర్

రాయవరం: నానో యూరియాతో అధిక ప్రయోజనాలున్నట్లు మండల వ్యవసాయాధికారి కొప్పిశెట్టి ప్రభాకర్ రైతులకు సూచించారు. మండలంలోని వెదురుపాకలో గురువారం డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతమున్న యూరియా వినియోగం వల్ల నేల, గాలి, నీరు కలుషితమవుతున్నాయన్నారు. అలాగే ప్రస్తుతం ఉన్న యూరియాతో పోలిస్తే నానో యూరియాతో ఒక ఎకరానికి అయ్యే ఖర్చు కూడా తగ్గుతుందని చెప్పారు. నానో యూరియా పైరుకు అధికంగా ఉపయోగపడుతుందని, అలాగే రవాణాకు సౌకర్యవంతంగా ఉంటుందని, ఎకరాకు 500 మి.లీ. బాటిల్స్ రెండు ఉపయోగిస్తే సరిపోతుందన్నారు. పొలంబడిలో సర్పంచ్ మల్లిడి సూరారెడ్డి, స్థానిక రైతులు వాసంశెట్టి గోపికృష్ణ, కొవ్వూరి జానకిరామారెడ్డి, కొవ్వూరి సత్తిరెడ్డి, తాడి బులివెంకటరెడ్డి పాల్గొన్నారు.

సంక్రాంతికి కోఢీ

- పందేలకు సిద్ధమవుతున్న బరులు
- కఠిన చర్యలు తప్పవంటున్న పోలీసులు



కోడిపందేలు నిర్వహిస్తున్న దృశ్యం(ఫైల్)

రాయవరం: సంక్రాంతి సందర్భంగా కోడి పందేల నిర్వహణకు గ్రామాల్లో ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. పందేలు నిర్వహించొద్దంటూ ఒకపక్క ప్రభుత్వ అధికారులు గ్రామాల్లో ప్రచారం చేస్తున్నారు. మరోవైపు పందెంరాయుళ్లు బరులను సిద్ధం చేసుకుంటున్నారు. సంప్రదాయం ప్రకారం కోడి పందేల నిర్వహణకు ఆఖరి నిమిషంలోనైనా అనుమతులు రాకపోతాయా అన్న ధీమా పందెంరాయుళ్లలో కనిపిస్తోంది.

సంక్రాంతి మూడు రోజులు రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలో పలు చోట్ల కోడి పందేలు జరిగే అవకాశాలున్నాయి. సాధారణంగా సంక్రాంతి పర్వదినం మూడు రోజులు కోడి పందేల నిర్వహణకు ఏర్పాట్లు సాగుతుంటాయి. గతంలోను పోలీసులు కోడిపందేలపై దాడులు నిర్వహించి కేసులు సైతం నమోదు చేశారు. కపిలేశ్వరపురం మండలంలోని లంక గ్రామాలు, కపిలేశ్వరపురం గోదారిగట్టు, ద్వారపూడి, కేశవరం, రాయవరం, కూర్మాపురం, చెల్లూరు, పసలపూడి, సోమేశ్వరం, ఏడిద, ఏడిద సీతానగరం, మెర్నిపాడు తదితర ప్రాంతాల్లో కోడిపందేలు జరుగుతుంటాయి. కోడిపందేల ద్వారా రూ.లక్షలు చేతులు మారడం ఇక్కడ సర్వసాధారణ విషయమే. ఈ ఏడాది కూడా పందేలు నిర్వహించుకునేందుకు పందెంరాయుళ్లు గుట్టుచప్పుడు కాకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామశివార్లలో ఉండే తోటలు, ఖాళీగా ఉన్న ప్రదేశాల్లో పందేలు నిర్వహించేందుకు అనువుగా ఉండే స్థలాలను పరిశీలిస్తున్నారు.

బరిలో గెలిచేదెవరు?

ఎట్టి పరిస్థితుల్లోనూ కోడిపందేలు, జూదాలు వంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవంటూ పోలీసులు హెచ్చరిస్తున్నారు. పోలీసులు, తహసీల్దార్లు కలిసి గతంలో పందేలు జరిగిన గ్రామాలకు వెళ్లి బరులేమైనా ఏర్పాటు చేశారేమో పరిశీలిస్తున్నారు. ఆయా గ్రామాల్లో పందేలకు వ్యతిరేకంగా ఫ్లెక్సీలు ఏర్పాటుచేసి గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్నారు. మరోవైపు తహసీల్దార్ కోర్టులో ఇప్పటికే ఎక్కడికక్కడ పందెంరాయుళ్లను బైండోవర్ చేస్తున్నారు. రామచంద్రపురం సబ్ డివిజన్ పరిధిలో ఇప్పటి వరకు 100 మందిని బైండోవర్ చేశారు. శుక్రవారం సాయంత్రంలోగా ఇంకా పలువురిని బైండోవర్ చేసే అవకాశముంది. అయినా నిర్వాహకులు మాత్రం ఏమీ పట్టించుకోకుండా తమ పని కానిచ్చేస్తున్నారు. కత్తులు లేకుండా జట్టీ పందేలైనా నిర్వహించుకునేందుకు అనుమతి లభిస్తుందన్న ధీమాలో వారున్నారు. బరుల వద్ద వివిధ దుకాణాలు, బెల్ట్‌షాపులు పెట్టడానికి చిరు వ్యాపారులు సన్నద్ధమవుతున్నారు.

కఠిన చర్యలు తప్పవు



సంప్రదాయబద్ధమైన క్రీడలకే ప్రాధాన్యమివ్వాలి. ఎట్టి పరిస్థితుల్లోను సంక్రాంతి పండగ పేరు చెప్పి పందేలకు కాలు దువ్వితే కఠిన చర్యలు తప్పవు. ఇప్పటికే నిర్వాహకులపై నిఘా ఉంచాం. గతంలో కోడి పందేలను నిర్వహించిన వారిని బైండోవర్ చేస్తున్నాం. ఎక్కడైనా కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు తెలిస్తే వెంటనే మాకు సమాచారం ఇవ్వండి.

– డి.బాలచంద్రారెడ్డి, డీఎస్పీ, రామచంద్రపురం

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవు

రాయవరం: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని కోడిపందేలు, పేకాట, గుండాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ కేజే ప్రకాష్‌బాబు, రాయవరం ఎస్‌ఐ వీవీఎస్ఎస్ సురేష్‌లు హెచ్చరించారు. గతంలో కోడి పందేలు నిర్వహించిన బరులను మండల స్థాయి అధికారుల బృందం గురువారం పరిశీలించారు. మండలంలోని రాయవరం, వెంటూరు, కూర్మాపురం గ్రామాల్లో కోడిపందేల బరులను ఎస్‌ఐ సురేష్, తహసీల్దార్ ప్రకాష్‌బాబులు పరిశీలించి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. కోర్టు ఉత్తర్వులు ఉల్లంఘించి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ నెల 23వ తేదీ వరకు సమస్యాత్మక ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. వారి వెంట ఏఎస్‌ఐ వెంకటేశ్వరరావు, స్థానిక వీఆర్వోలు పాల్గొన్నారు.

టేకిలో సుదర్శన హోమం

కపిలేశ్వరపురం: టేకిలోని భూసమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం సుదర్శన హోమం, శాంతి కల్యాణం చేశారు. పెద్దింటి వెంకట లక్ష్మీ నరసింహాచార్యులు, ఫణికుమార్, ప్రసన్న కుమార భార్గవ్ ఆధ్వర్యంలోని పండితులు స్వామి కల్యాణ పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ నెల 17 వరకూ ధనుర్మాస పూజలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

16, 17 తేదీల్లో అ'పూర్వ' సమ్మేళనం

రాయవరం: ఈ నెల 16, 17 తేదీల్లో రాయవరం శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలల పూర్వ విద్యార్థులు సమ్మేళనానికి సన్నద్ధమవుతున్నారు. 16న 1982–83 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు పాఠశాలలో కలిసేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ నెల 17వ తేదీన 1990–95 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు పాఠశాలలో కలుసుకోబోతున్నారు. అపూర్వ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించుకోనున్నారు.

గ్యాస్ వినియోగంపై అవగాహన పెంచుకోవాలి

కాజులూరు: గ్యాస్ వినియోగంపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని పల్లిపాలెం గ్రామ సర్పంచ్ వడ్లపాటి భాస్కరరావు అన్నారు. గురువారం గ్రామంలో గెయిల్ ఇండియా అధికారుల ఆధ్వర్యంలో రామచంద్రపురానికి చెందిన బుర్రకథ కళాకారులు గొర్రెల రాము, కృష్ణ సోదరుల బృందం బుర్రకథ నిర్వహించి వంట గ్యాస్ వినియోగం, గెయిల్ ఇండియా సహజవాయువుల పైప్‌లైన్ రక్షణ కోసం ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

రేపు గోదాదేవి కల్యాణం

రామచంద్రపురం రూరల్: మండలంలోని ఆదివారపుపేట శివబాలయోగి మహారాజ్ ఆశ్రమంలో కొలువైయున్న రంగనాథస్వామి, గోదాదేవి అమ్మవార్ల కల్యాణోత్సవం ఈ నెల 14న ఘనంగా నిర్వహించనున్నారు. 15న స్వామివారికి, అమ్మవార్లకు ఉయ్యాలోత్సవం జరుగుతుందని ఆశ్రమ నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

దాడి ఘటనపై కేసు

రాయవరం: పసలపూడిలో జరిగిన దాడి ఘటనపై కేసు నమోదు చేసినట్లు రాయవరం ఎస్‌ఐ సురేష్ విలేకరులకు తెలిపారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం భీమక్రోసుపాలెం గ్రామానికి చెందిన సత్తిబాబు రాజానగరం మండలం పాత తుంగపాడులో పేదలకు గతంలో ఇళ్ల స్థలాలు ఇప్పించాడు. వాటిలో రెండు స్థలాలను చీకట్ల వెంకటేశ్వరరావు ఆక్రమించగా, సత్తిబాబు బాధితుల తరపున పోరాడి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదులు చేశాడు. దీంతో వెంకటేశ్వరరావు కక్ష పెంచుకుని ఈ నెల 9న పసలపూడిలో సత్తిబాబుపై దాడి చేసి గాయపరిచాడు. సత్తిబాబు రామచంద్రపురం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. రామచంద్రపురం డీఎస్పీ బాలచంద్రారెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

ముందే వచ్చిన సంక్రాంతి

- ఆటపాటలతో సందడి చేసిన చిన్నారులు
- బొమ్మలకొలువులు, భోగిమంటలతో సందడి



పామర్రులో బొమ్మల కొలువు వద్ద విద్యార్థులు



మండపేట విద్యావికాస్‌లో సంప్రదాయ వేషధారణలో సందడి చేసిన చిన్నారులు



వీఎస్ఎంలో సంప్రదాయ దుస్తులతో రంగవల్లుల పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

మండపేట: సంక్రాంతి ముందే వచ్చింది. పిల్లలు, పెద్దలన్న తేడాలేకుండా ఇంటింటా సందడి తెచ్చింది. పట్టణంలోని రావులపేటలో ఉన్న విద్యావికాస్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. చిన్నారులు సంప్రదాయ వేషధారణలో అలరించారు. బొమ్మలకొలువు, హరిదాసులు, కొమ్మదాసులు, కోయదాసుల వేషధారణల్లో చిన్నారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా హెచ్ఎం బొల్లోజు పార్వతి, శ్రీనివాసు తదితరులు సంక్రాంతి పండుగ ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. పట్టణంలోని సెయింట్‌ఆన్స్ స్కూల్‌లో పిల్లలపై భోగిపళ్లు వేసి పెద్దల ఆశీర్వచనాలు, భోగిమంటలతో పండగ వాతావరణం కనిపించింది.

రామచంద్రపురం: వీఎస్ఎం విద్యాసంస్థల ప్రాంగణంలో జరిగిన సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. యువత సంప్రదాయ వస్త్రాలు ధరించి అలరించారు. కళాశాలలు రంగవల్లులతో ముస్తాబయ్యాయి. సంప్రదాయ దుస్తుల పోటీలు, రంగవల్లుల పోటీలు పతంగాలు పోటీలు వైభవోపేతంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎస్ఎస్ ఆలీ అన్సారీ పోటీలను ప్రారంభించారు. మధ్యాహ్నం భోగిమంటలు, పిల్లలకు భోగిపళ్లు పోయడం, గొబ్బెమ్మల పూజలు చేసి సంక్రాంతి శోభను తీసుకొచ్చారు. కార్యక్రమాల్ని కళాశాల మేథ్స్ హెచ్ఓడీ ఎల్ఎస్ఎం మల్లిక, ఛాముండేశ్వరి, ఎస్ విజయలక్ష్మి, ఎ.వెంకటలక్ష్మి పర్యవేక్షించారు.

కె.గంగవరం: పామర్రులోని శ్రీవిద్యానికేతన్ స్కూల్ విద్యార్థులు బుధవారం సాయంత్రం బొమ్మల కొలువు, హరిదాసు వేషధారణ, కోలాటం, భోగిమంట వంటి కార్యక్రమాలతో సందడి చేశారు. రంగుల ముగ్గులు, వాటి మధ్య గొబ్బెమ్మలు పెట్టి విద్యార్థినులు నృత్యాలు చేశారు. మన సంప్రదాయాలను చిన్నారులకు తెలియజెప్పేందుకే సంబరాలు ఏర్పాటుచేశామని పాఠశాల యాజమాన్యం చెప్పింది.

కాజులూరు: కాజులూరు కోటి హైస్కూల్‌లో గురువారం ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. పండగ వాతావరణం ఉట్టిపడేలా భోగిమంటలు వేసి జానపద గేయాలు పాడుతూ నృత్యాలు చేశారు. ఆటల పోటీలు, ముగ్గుల పోటీల్లో విజేతలకు వైఎస్సార్‌సీపీ నేత డాక్టర్ పితాని అన్నవరం చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల బీసీ సెల్ కన్వీనర్ గుబ్బల ఏసురాజు, రామచంద్రపురం వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ దంగేటి అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజలకే జవాబుదారులం

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- టిడ్కో ఫ్లాట్ల వద్ద వాటర్ ట్యాంక్ ప్రారంభం



టిడ్కో ఫ్లాట్ల వద్ద వాటర్ ట్యాంకు ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: తాము ప్రజలకే జవాబుదారులమని, ప్రభుత్వంపై బురదజల్లి పబ్బం గడుపుకోవాలనే ప్రతిపక్ష నాయకులకు సమాధానం చెప్పాల్సిన పని లేదని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. పట్టణంలోని టిడ్కో ఫ్లాట్ల వద్ద నిర్మించిన 12 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన రక్షిత మంచినీటి పథకాన్ని గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, యువనేత తోట పృథ్వీరాజ్ తదితరులతో కలిసి ఎమ్మెల్సీ తోట ప్రారంభించారు. ఫ్లాట్లలో కుళాయిలను ప్రారంభించారు. అనంతరం ఆయన లబ్ధిదారులను సమస్యలడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తోట మీడియాతో మాట్లాడుతూ ఒక పక్క అభివృద్ధి పనులు జరుగుతుంటే ఆ విషయాన్ని పక్కన పెట్టి ప్రచార ఆర్భాటం కోసం ప్రభుత్వంపై బురద జల్లడమే ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పనిగా పెట్టుకున్నారన్నారు. తమకు అప్పగిస్తే 15 రోజుల్లో టిడ్కో ఫ్లాట్లు పనులు పూర్తిచేస్తామంటున్న ఎమ్మెల్యే వేగుళ్ల గత ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలోనే ఎందుకు పూర్తిచేయలేదన్నారు. మున్సిపల్ సమావేశాల్లో డీసెంట్ పేరిట అభివృద్ధి పనులకు ఆటంకం కల్పించడం పనిగా పెట్టుకున్నారన్నారు. ఇటీవల విజయలక్ష్మి నగర్‌లో రూ.1 కోటి నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు అజెండాలోని అంశంపై ప్రతిపక్ష సభ్యులతో డీసెంట్ పెట్టించారని మండిపడ్డారు. ద్వారపూడిలో బస్ షెల్టర్ నిర్మాణంపై అధికారులను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల గతంలో ఏ విధమైన అనుమతులు లేకుండా ఎలా నిర్మాణం చేశారని ప్రశ్నించారు. ప్రభుత్వం తప్పులు ఎత్తి చూపించడం ప్రతిపక్ష పార్టీ బాధ్యతని, అయితే అది ఎంతవరకు చేయాలనే పరిమితులు తెలుసుకోవాలని ఎమ్మెల్సీ తోట హితవుపలికారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు, వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, మున్సిపల్ విప్ పోతంశెట్టి ప్రసాద్, అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు



అంగరలో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచిన అంజికి జ్ఞాపికను అందజేస్తున్న సీనియర్ క్రికెటర్ విష్ణు

కపిలేశ్వరపురం: అంగరలో సిద్ధిరెడ్డి నరసబాబు ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు హోరా హోరీగా సాగుతున్నాయి. ఈ నెల 14 వరకూ కొనసాగే పోటీల్లో భాగంగా గురువారం మూడు మ్యాచ్‌లు జరిగాయి. మండపేట–చెయ్యేరు టీంలకు జరిగిన మ్యాచ్‌లో చెయ్యేరు టీం విజయం సాధించింది. మంజీర–కోరుమిల్లి మ్యాచ్‌లో మంజీర టీం, గోపి–వాడపాలెం టీంల మధ్య జరిగిన మ్యాచ్‌లో వాడపాలెం విజయం సాధించాయి. ఆయా మ్యాచ్‌ల్లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచిన అంజి, శివ, సునీల్‌లకు సీనియర్ క్రికెటర్ విష్ణు చేతుల మీదుగా జ్ఞాపికలను అందజేశారు.

వైఎస్సార్ జల కళ పనులకు భూమిపూజ



బోరు పనులకు భూమి పూజ చేస్తున్న వెంకన్నబాబు తదితరులు

మండపేట: వైఎస్సార్ జల కళ పథకం ద్వారా మండలంలోని కేశవరంలో రూ.3.12 లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటుచేస్తున్న బోరు పనులకు గురువారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని, మెట్ట ప్రాంతాల్లో సాగునీటి సమస్య తలెత్తకుండా సన్నచిన్నకారు రైతులకు ప్రభుత్వం ఉచితంగా బోర్లు తవ్విస్తోందన్నారు. తమకు బోరు మంజూరు చేయించడంపై ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు లబ్ధిదారులు దాసరి రామ నాగ దుర్గ, ఆకుల భీమశంకరంలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల ఆర్‌బీకే కమిటీ చైర్మన్ అన్నందేవుల చంద్రరావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు తుపాకుల ప్రసన్నకుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు మన్నే భూషణం, ముక్కపాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యల్లాప్రగడ జయంతి



సుబ్బారావుకు నివాళులర్పిస్తున్న సత్యనారాయణ తదితరులు

మండపేట: డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు 128వ జయంతి వేడుకలు మండపేట పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా జరిగాయి. స్థానిక సంఘ కార్యాలయం వద్ద సుబ్బారావు చిత్రపటానికి పీఎంపీ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు కోన సత్యనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో వ్యాధులకు ఔషధాలను కనుగొనడం ద్వారా సుబ్బారావు నవయువ ధన్వంతరీగా ఖ్యాతిగాంచారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మారిశెట్టి సత్యనారాయణ, సంఘ నాయకులు బళ్లా వెంకటరమణ, వానపల్లి కనకరాజు, మండిపూడి చంద్రశేఖర్, ధర్మవరపు చిన్నారావు, పిల్లా సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నూతన పీహెచ్‌సీని సందర్శించిన ఎంపీపీ

కె.గంగవరం: పామర్రులో నూతనంగా నిర్మించిన పీహెచ్‌సీ భవనాన్ని ఎంపీపీ పంపన నాగమణి గురువారం సందర్శించారు. గ్రామంలోని 24 గంటల ప్రభుత్వ ఆసుపత్రి శిధిలావస్థకు చేరడంతో రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ ఆదేశాల మేరకు రూ.1.52 లక్షల నాడు–నేడు నిధులతో నూతన పీహెచ్‌సీ భవనానికి శ్రీకారం చుట్టారు. ఇటీవల నిర్మాణం పూర్తవడంతో ఎంపీపీ నాగమణి పీహెచ్‌సీని పరిశీలించారు. త్వరలో మంత్రి చెల్లుబోయిన వేణు చేతుల మీదుగా పీహెచ్‌సీ ప్రారంభోత్సవం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు నానాపరపు కల్యాణి, వాసంశెట్టి సూరిబాబు, నాయకులు పంపన సుబ్బారావు, సాదె కపిల్ తదితరులు పాల్గొన్నారు.

వివేకానందుని జీవితం యువతకు స్ఫూర్తిదాయకం

- ఘనంగా వివేకానందుని జయంతి వేడుకలు



రామచంద్రపురంలో వివేకానందుని విగ్రహానికి నివాళులర్పిస్తున్న నేతలు



వివేకానందుని చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అమ్మిరెడ్డి



పసలపూడిలో వివేకానందుని విగ్రహానికి నివాళులర్పిస్తున్న శ్రీనివాసరెడ్డి తదితరులు

రాయవరం: స్వామి వివేకానందుని జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని ఆదికవి నన్నయ యూనివర్శిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మల్లిడి అమ్మిరెడ్డి పేర్కొన్నారు. రాయవరంలోని విజ్ఞాన్ జూనియర్ కళాశాలలో గురువారం స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ సబ్బెళ్ల అచ్చిరెడ్డి ఆధ్వర్యంలో వివేకానందుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వీఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాల డైరెక్టర్ శేషవేణి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మల్లిడి సతీష్‌రెడ్డి, విజ్ఞాన్ జూనియర్ కళాశాల డైరెక్టర్స్ టి.పార్వతి, టి.అమ్మిరెడ్డి, తాతారెడ్డి పాల్గొన్నారు. పసలపూడిలోని స్థానిక శ్రీనగర్‌లో తాడి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వివేకానందుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వివేకానందుని జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శవంతమన్నారు.

రామచంద్రపురంలో..

రామచంద్రపురం: వివేకానందుని జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని వికాస్ విద్యాసంస్థల అధినేత వీవీ రమణ అన్నారు. వివేకానంద జయంతిని పురస్కరించుకుని వికాస్ విద్యాసంస్థల నేతృత్వంలో స్థానిక శివాలయం వీధిలోని వివేకానందుని విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్ వాడ్రేవుసాయిప్రసాద్, బీజేపీ జిల్లా ట్రేడ్ యూనియన్ కన్వీనర్ కొట్టువాడ హరిబాబు, స్వచ్ఛభారత్ జిల్లా కన్వీనర్ సలాది సతీష్‌నాయుడు, జిల్లా ఉపాధ్యాక్షుడు యాంఢ్ర బుల్లబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

దేశం అన్ని రకాలుగా అభివృద్ధి చెందాలంటే యువత కీలక పాత్ర పోషించాలని వీఎస్ఎం అటానమస్ కళాశాల ప్రిన్సిపాల్ ఆలీ అన్సారీ అన్నారు. వివేకానందుని జయంతిని పురస్కరించుకుని కలాశాలలో ఏర్పాటు చేసిన జాతీయ యువజనోత్సవ వేడుకలను జ్యోతి ప్రజ్వలన చేసి ఆయన ప్రారంభించారు. కళాశాల తెలుగు అధ్యాపకులు డాక్టర్ ర్యాలి శ్రీనివాస్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వి.రవీంద్ర, ఫిజిక్స్ హెడ్ ఆర్.నాగేశ్వరరావు తదితరులు ప్రసంగించారు.

కాజులూరులో..

కాజులూరు: గొల్లపాలెంలో సమరసత వేదిక ఆధ్వర్యంలో స్వామి వివేకానంద 160వ జయంతి వేడుకలు గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కాకినాడ జిల్లా సమరసత సంయోజక్ డాక్టర్ శీలామంతుల వీరభద్రరావు మాట్లాడుతూ వివేకానందుడు పుట్టిన గడ్డపై పుట్టడం మనందరి అదృష్టమన్నారు. యువతరం స్వామి వివేకానందున్ని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. దుగ్గుదుర్రులో అమలాపురం శెట్టిబలిజ సంక్షేమ సంఘం కన్వీనర్ కదలి రాంపండు ఆధ్వర్యంలో వివేకానందుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జీవో నంబర్-1ను రద్దు చేయాలి

రాయవరం: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబర్–1ను రద్దు చేయాలని కోరుతూ మండల సీఐటీయు కమిటీ కన్వీనర్ ఆధ్వర్యంలో గురువారం రాయవరంలో నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా జీవో నంబర్–1కు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్నామన్నారు. అనంతరం తహసీల్దార్ కేజే ప్రకాష్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్స్ అసోసియేషన్ నేతలు పద్మ, సత్యవేణి, కమల, ఆశ వర్కర్స్ అసోసియేషన్ నేతలు బేబి, దుర్గ పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో తృతీయ స్థానం



పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న వైస్ ప్రెసిడెంట్ మూర్తి తదితరులు

రామచంద్రపురం: నన్నయ విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల హ్యాండ్‌బాల్ పోటీల్లో వీఎస్ఎం అటానమస్ కళాశాల జట్టు తృతీయ స్థానం కైవసం చేసుకుందని ప్రిన్సిపాల్ ఎస్ఎస్ ఆలీ అన్సారీ గురువారం స్థానిక విలేకరులకు తెలిపారు. క్రీడాకారులకు నిర్వహించిన అభినందన సభలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వీఎస్ఎం విద్యార్థులు ఎం.శివశంకర్, ఓ.గౌరినాయుడులు సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్శిటీకి ఎంపికయ్యారని చెప్పారు. వీరిద్దరూ జనవరి నెలాఖరులో పెరియార్ యూనివర్శిటీలో జరిగే హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఎంపికైన క్రీడాకారులను కళాశాల వైస్ ప్రెసిడెంట్ ఎంఎస్ఎస్ మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ ఎస్ఎస్ఆలీ, పీడీలు మనోహర్ అభినందించారు.

అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ

కాకినాడలో జరిగిన అథ్లెటిక్స్ క్రీడా పోటీల్లో వీఎస్ఎం విద్యార్థులు ప్రతిభ కనబరిచారని వీఎస్ఎం ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.బాలాజీ గురువారం స్థానిక విలేకరులకు తెలిపారు. అథ్లెటిక్స్ 400 మీటర్ల పరుగు పందెంలో పాలిటెక్నిక్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని సౌజన్య సిల్వర్ మెడల్, 1500 మీటర్ల పరుగు పందెంలో దుర్గాప్రసాద్ సిల్వర్‌మెడల్, 4 ఇన్‌టూ 100లో కార్తిక్, సత్యపవన్, శ్రీను, దుర్గాప్రసాద్‌లు కాంస్య పతకాలను సాధించినట్లు ఆయన తెలిపారు. టేబుల్ టెన్నిస్ సింగిల్స్, డబుల్స్‌లో దిలీప్‌కుమార్, మణికంఠలు ప్రథమ స్థానాలు కైవం చేసుకున్నారని చెప్పారు. విజేతలను కళాశాల వైస్ ప్రెసిడెంట్ ఎంఎస్ఎస్ మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ వి.రవీంద్ర, ఏఓ సత్యనారాయణ తదితరులు అభినందించారు.